మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పెబ్బేరులో దారి దోపిడీ

- కత్తులతో రాళ్లతో దాడి.. ముగ్గురికి తీవ్రంగా గాయాలు
- 14 తులాల బంగారం చోరీ
- గాయపడిన వారిని మహబూబ్‌నగర్ హాస్పిటల్‌కి తరలింపు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పి రావుల గిరిధర్



సంఘటన స్థలన పరిశీలిస్తున్న ఎస్పి



దాడి జరిగిన కారు

**పెబ్బేరు డిసెంబరు 18 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ఆర్టీఓ ఆఫీస్ ఎదురుగా ఎదురుగా ఉన్న జాతీయ రహదారి 44 వాహనాలు నిలిపే స్థలం దగ్గర జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కూజన్ కొత్తూరు గ్రామానికి చెందిన సంతోష్ కుటుంబ సభ్యులు అరుణాచలం, తిరుపతి తీర్థయాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పెబ్బేరు పట్టణం ఆర్టీఓ ఆఫీస్ ఎదురుగా బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు ఆగి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు దాడి చేసి మహిళల మెడలో ఉన్న 14 తులాల బంగారు గొలుసులను తీసుకొని కత్తులతో, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో సంతోష్, శ్రీశాంత్, ప్రణీత్ ముగ్గురికి తీవ్ర గాయాలు అవడంతో వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, క్లూస్ టీమ్, కుక్కతో ఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రల సేకరణ చేసి బాధితుల నుండి వివరాలు సేకరించారు. ఆయన వెంట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి, శ్రీరంగపురం ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

## చెరువు కట్టను ప్రజల

# సౌకర్యార్థం అభివృద్ధి చేయాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 18 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలోని నల్ల చెరువు కట్టను పట్టణ ప్రజలకు నడక, వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, మున్సిపల్ అధికారులతో కలిసి నల్ల చెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు, ఉదయం, సాయంత్రం కాలి నడక, వ్యాయామం చేసుకునేవిధంగా కట్టను అభివృద్ధి చేయాలని అందుకు అవసరమైన డి.పి.ఆర్.ను సిద్ధం చేసి ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి పై నుండి భారీ వాహనాలు నడవకుండా గేట్ పెట్టాలని సూచించారు. ప్రజలు నడకతో పాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులు, రెండు దిక్కుల అందమైన మొక్కలు వంటివి అభివృద్ధి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, వైస్ చైర్మన్ కృష్ణ, మున్సిపల్ డి.ఈ యునస్, ఏ.ఈ తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.



నల్ల చెరువు కట్టను పరిశీలిస్తున్న కలెక్టర్

## మున్సిపాలిటీల అభివృద్ధి పనులు

# పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, డిసెంబరు 18 ప్రభాతవార్త :** మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాలను పక్కాగా నిర్వహించి, అభి వృద్ధి పనులను వేగవం తంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సం తోష్ అధికారులకు ఆదే శించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ము న్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా గద్వాల, ఐజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు మంజూరైననిధులు, వాటిద్వారా చేపట్టిన అభివృద్ధి పను లపై సమీక్షించారు. 15వ ఫైనాన్స్, సీఎం అష్యూరెన్స్ ఫండ్, పన్నులు, గృహ నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆదాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఆదాయాన్ని సరైన అకౌంటింగ్ ప్రక్రియలతో నిర్వహించి, చార్టెడ్ అకౌంటెంట్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆడిట్ చేయించాలన్నారు. నిధులను ఇతర పనులకు మళ్లించకుండా పద్ధతి ప్రకారం ఖర్చుచేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల వేగవంతం వివిధ స్కీముల నుండి వచ్చిన నిధులద్వారా చేపట్టిన పనులను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ముఖ్యంగా స్వచ్ఛ భారత్ నిధుల కింద చేపట్టిన మరుగుదొడ్లు, పబ్లిక్ టాయిలెట్స్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని, పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వారం వరకు నిధుల వివరాలను సమగ్రంగా అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు, మున్సిపల్ కమిషనర్లు, డిఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

**తెలకపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల పై అసెంబ్లీలో జరిగిన చర్చల్లో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి ప్రస్తావించడం జరిగింది. గత పాలనలో ఏ ఎమ్మెల్యే, ఎంపీ గాని గురుకుల పాఠశాలల్లో సందర్శించిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. గత పది సంవత్సరాలలో గురుకులాలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులతో గురయ్యారని ఆయన ప్రస్తావించారు.



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

## ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్ర శివారులోని పలు ప్రభుత్వ స్థలాలను జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ బుధవారం పరిశీలించారు. నారాయణపేట కొండారెడ్డిపల్లి చెరువు మార్గంలోని 104 సర్వే నంబర్ లో గల దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం నిర్మాణం కోసం పరిశీలించారు. అలాగే సింగారం వద్ద నూతన కలెక్టరేట్ వెనక వైపున గల 31 సర్వే నంబర్ లోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, ఆర్డీవో రామచంద్రనాయక్, అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

# లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు కృషి చేయాలి

### మహిళా శక్తి కింద రుణాలు అందజేయాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

### బ్యాంకర్లతో డిసిసి, డిఎల్‌ఆర్సి సమావేశం

### నిర్వహించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



హాజరైన బ్యాంక్ అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో డిసెంబరు 18 ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో భాగంగా సంబంధిత వర్గాలకు సకాలంలో రుణాలు అందజేసి వంద శాతం లక్ష్యం సాధించేందుకు బ్యాంకర్లు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో రైతులకు పంట రుణాల పంపిణీ, స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజి రుణం, మహిళా శక్తి యూనిట్‌లకు రుణం, ఇతర అంశాలపై డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 202425 సంవత్సరానికి రెండవ త్రైమాసం సెప్టెంబర్ చివరి నాటికి 45.78 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి హామీ కార్యక్రమం (పిఎంఇజిపి) కింద వచ్చిన దరఖాస్తులు ఎక్కువగా తిరస్కరణకు గురి అవుతున్నాయని, వీటిని కేసు వారీగా పరిష్కరించి రుణం మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద బ్యాంక్ రుణం, బ్యాంక్ లీకేజి ద్వారా విరివిగా రుణ సహాయం అందించాలని కోరారు. ఎస్.సి. కార్పొరేషన్, ఎస్.టి కార్పొరేషన్ పెండింగ్ యూనిట్‌లకు రుణ సహాయం అందించాలని అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా మేకలు, గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకం యూనిట్‌లకు దరఖాస్తు చేసుకున్న వారికి సబ్సిడీ రుణం మంజూరు చేయాలని అన్నారు. నాబార్డ్ డి.డి.ఎం. షణ్ముఖ చారి మాట్లాడుతూ వ్యవసాయ మౌలిక వసతుల రుణం కింద 63 కోట్లకు గాను 56 కోట్ల రుణం అందించినట్లు తెలిపారు. ఇంటర్‌నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో బ్యాంకులకు ప్రతిపాదనలు పంపిస్తే వి. శాట్ పరికరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా డైరీ సహకార సంఘాలు డి.సి.సి.బి ద్వారా దరఖాస్తు చేసుకుంటే మైక్రో ఏ.టి.ఎం.లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్.బి.ఐ లీడ్ డిస్ట్రిక్ట్ అధికారి పృథ్వి మాట్లాడుతూ బ్యాంకర్‌లు వాడకుండా ఉన్న బ్యాంక్ అకౌంట్ లను కె.వై సీ, ఈ కె.వై.సి చేసి తిరిగి వాడుకలోకి తీసుకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎల్.డి.ఎం. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ సేవా మోడల్ సి.ఎస్.సి. సెంటర్ ఏర్పాటు పోస్టర్ ఆవిష్కరణ మహబూబ్ నగర్ జిల్లాలో 100 మోడల్ సిఎస్‌సి ఐసిటి కేంద్రాలను ఏర్పాటు చేయడం కొరకు ఈరోజు జరిగిన జిల్లా బ్యాంకర్ల సమావేశంలో మహిళ శక్తి కింద జిల్లాలో 25 మంది మహిళపొదుపు సంఘం మహిళలను గుర్తించారు వీరికి పిఎంజిపి ద్వారా రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లకు, సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల జారీచేశారు జిల్లాలో మారుమూల గ్రామాల్లో డిజిటల్ సేవలతో పాటు బ్యాంకింగ్ ఆధార్ సేవలను అనుసందనిస్తు 100 నిరుద్యోగులకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తేవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రాజెక్ట్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ బేతోజు హరికృష్ణ కుమార్, సి.యస్ సి జిల్లా మేనేజర్ అనిల్ పాల్గొన్నారు.

# పెదిరిపాడ్ కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తనిఖీ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడ్ కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం జిల్లాకలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలను తనిఖీ చేసేందుకు ఇప్పటివరకు ఎవరెవరు వచ్చారని అడగగా రెవిన్యూ అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, సివిల్ సప్లై అధికారితో పాటు తహసిల్దార్ కూడా పాఠశాలకు వచ్చి వెళ్లారని ఎస్ఓ కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. బుధవారం మెనూప్రకారం ఏమేమి వంటచేశారని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. బుధవారం బెండకాయ కర్రీకి బదులుగా టమాటా కర్రీ చేయడాన్ని కలెక్టర్ తప్పు పట్టారు. ఖచ్చితంగా మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని పాఠశాల ఎస్ఓను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం వండే బియ్యంతో పాటు కూరగాయలు, పప్పు, ఇతర వంట సామాగ్రిని పరిశీలించిన తర్వాత బాగుంటేనే వంట చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం వండిన తర్వాత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, మెస్ కమిటీ విద్యార్థులు ముందుగా రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. బియ్యంలో పురుగులు ఏమైనా ఉంటున్నాయా అని వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. పురుగులు ఏమీ లేవని, ఒకరోజు ముందే బియ్యాన్ని శుభ్రం చేసి మరుసటి రోజు వాటిని మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్నామని ఏజెన్సీ సభ్యులు కలెక్టర్ కు తెలిపారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ తిన్నారు. ఉపాధ్యాయులు, ఈసందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. ఉదయం ఏం తిన్నారని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా? లేదా? అని అడిగారు. బాగుంటే బాగుందని, లేకపోతే లేదని ధైర్యంగా చెప్పాలని విద్యార్థులకు ఆమె సూచించారు. బాగా లేకపోతే మళ్లీ వండి వడ్డిస్తారని చెప్పారు. కాగా పాఠశాలలో ఆర్వో ప్లాంట్ చెడిపోవడంతో బోరు నీటినే విద్యార్థులు తాగుతున్నారని, ఆర్వో ప్లాంట్ అవసరమని, అలాగే పాఠశాలకు ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఓ కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే –మిగతా4లో..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

# భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### - నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అదనపు కలెక్టర్ జిల్లాలోని రెవిన్యూ, నీటి పారుదల శాఖ, సర్వేల్యాండ్స్ రికార్డ్స్, శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులైన మహాత్మాగాంధీ కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు, మార్కండేయ ప్రాజెక్టు, అచ్చంపేట ప్రాజెక్టు, కర్నే తండా ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు, అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని జిల్లాఅదనపు కలెక్టర్ కె సీతారామారావు అధికారులకు సూచించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ వివరాలను ప్రాజెక్టుల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా సేకరించాల్సిన మొత్తం భూమి 25247.13 ఎకరాలకు గాను 21613.87 ఎకరాల భూమిని సేకరించామని, ఇంకా 3633.26 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని సంబంధిత అధికారులు త్వరితగతిన భూసేకరణ జరపాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే 167కు సంబంధించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని తెలియజేశారు. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదన కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంజికేఎల్ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణరెడ్డి, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యాదగిరి, నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్, అచ్చంపేట ఆర్డీవో మాధవి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, ఏఈ, డిఈ, ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్

## దోసుకున్నోడికి దోసుకున్నంత

# ఎవడు అడ్డం వస్తాడో చూస్తా

### రాజాపూర్‌లో అక్రమార్కుల తీరిది



రాయపల్లి డైరీ ఫాం వెనకాల హిటాచితో అక్రమ ఇసుక తయారీ

**రాజాపూర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలో అక్రమా ర్కులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. గుట్టు చప్పుడు కాకుండా కొ నసాగించే అక్రమ ఇసుక రవాణా ఇప్పుడు పట్టపగలే కొనసాగుతుంది. నిద్రమత్తు వీడని అధికారులు బుధవారం రాజాపూర్ మండల పరిధిలోని దుందుభి వాగులో అక్రమ ఇసుక మాఫియా ఆగడాలు అంత ఇంతా కాదు ఎటు చూసినా పెద్దపెద్ద గుంతలు అక్రమ కృత్రిమంగా తయారు చేసిన పెద్ద పెద్ద ఇసుక రాసులు దర్శనమిస్తున్నాయి. రాజాపూర్, రాయ పల్లి, చెన్నవెల్లి, తిరుమలాపూర్, దొండ్లపల్లి, ముదిరెడ్డిపల్లి, నందిగామ, మల్లెపల్లి, గ్రామాలను కలుపుతూ ప్రవహిస్తున్న దుందుభి వాగులోపై అన్ని గ్రామాలలో అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరుకాయలు గా కొనసాగుతుంది ప్రతిరోజు ఉదయం జెసిబిలు, హిటాచిలతో, ట్రాక్టర్ల ద్వారా భారీగా కృత్రిమ ఇసుక తయారుచేసి రాత్రి వేళలో దేశ రాజధానికి మరియు వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న ఇట్టి విషయం తెలిసిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇది ఇలానే కొనసాగితే భూగర్భ జలాలు అట్టడుగుకు పోయే ప్రమాదం ఉందని రైతులు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక రవాణాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.



కృత్రిమ ఇసుక దంపులు

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 18 ప్రభాతవార్త :** యం.ఎన్. జె క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. జిల్లాలో క్యాన్సర్ అనుమానిత మహిళలకు హైదారాబాద్ లోని ప్రముఖ యం.ఎన్. జె క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ పి మహేష్, సన చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సురభి సత్తయ్య, సురభి నర్సమ్మ లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో యం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం కోట్ల రూపాయల విలువ చేసే మామోగ్రమి యంత్రాలను ఈరోజు జిల్లాకు తీసుకురావడం జరిగిందన్నారు. మున్సిపల్ పారిశుధ్య మహిళా సిబ్బంది, ఇతర గ్రామాల్లోని క్యాన్సర్ అనుమానిత మహిళలను 102 వాహనం ద్వారా ఇక్కడికి తీసుకురావడం జరిగిందని అందరూ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సురభి సత్తయ్య మాట్లాడుతూ సన చారిటబుల్ ట్రస్ట్ అనేది తన నలుగురి కుటుంబ సభ్యుల పేర్లతో సత్తయ్య, ఆదర్శ్, నర్సమ్మ, అభిలాష్ పెట్టడం జరిగిందని తెలియజేశారు. సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యురాలు, ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురభి నర్సమ్మ మాట్లాడుతూ మహిళలు కుటుంబం పై పెట్టే దృష్టి తన ఆరోగ్యం పై పెట్టరని అందువల్ల ఆరోగ్యం క్షీణించాక బాధ పడుతుంటారన్నారు. తన తల్లి క్యాన్సర్ వ్యాధితో 1996 లో మరణించిందని, అందుకే మహిళలకు ఆరోగ్య పరంగా సహాయం చేయాలనే ఉద్దేశంతో సన చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, కలక్టర్ సతీమణి డా. నిపున్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పి. కృష్ణ, యం.ఎన్.జే హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, డా. రామచంద్ర రావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.




ఉచిత క్యాన్సర్ నిర్ధారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## మక్తల్ నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం కొరకు మంత్రికి వినతి

**మక్తల్ టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మక్తల్, మగనూర్, నర్వ, కృష్ణ, ఊట్కూర్, అమర చింత, ఆత్మకూర్ మండలాల్లోని పలు గ్రామాలకు నూతనంగా బీటీ రోడ్ల నిర్మాణానికి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి నిధుల కొరకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు రోడ్డు వ్యవస్థ లేక గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు, గత ప్రభుత్వం దశాబ్ద కాల పాటు గ్రామీణ రోడ్ల వ్యవస్థను పట్టించుకోకుండా గ్రామాలను నిర్వీర్యం చేయడం జరిగింది, ఇప్పటికీ రోడ్డు వ్యవస్థ లేక గ్రామంలోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారు, ఆయా మండలాల్లోని రోడ్లు లేని గ్రామాలకు రోడ్లను వేయించాలని ఆలోచనతో మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి గారు పంచాయతీ రాజ్ శాఖ మాత్యులు సీతక్కను కలుసుకొని కొత్త బిటి రోడ్ల నిర్మాణం కొరకు దాదాపుగా రూ.47 కోట్ల నిధులు కేటాయించాలని బుధవారము అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మాత్యులు సీతక్కను కోరడం జరిగింది, వెంటనే స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు ఈ సందర్భంగా మంత్రి మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఈ నెల 20న సీఎం కప్ సైక్లింగ్ పోటీలు

**మక్తల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా స్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీలను ఈ నెల 20న మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. బుధవారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 16 ఏళ్ల లోపు బాల బాలికలకు సబ్ జూనియర్స్, 18 ఏళ్లలోపు బాల బాలికలకు జూనియర్స్, 18 సంవత్సరాలు పైబడిన మహిళలకు,పురుషులకు సీనియర్స్ విభాగంలో రోడ్ స్పీడ్‌సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సీఎం కప్ సైక్లింగ్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు పోటీలకు అర్హులని,పోటీలలో పాల్గొను సైక్లింగ్ రైడర్స్ సొంత సైకిల్‌తో, హెల్మెట్, షూస్‌ధరించి పాల్గొనాలని వారు తెలిపారు. ఈ సైక్లింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలను ఈనెల 27నుండి 29వరకు రంగారెడ్డి జిల్లామహేశ్వరంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈసమావేశంలో పీడీలు సాయినాథ్,విష్ణువర్ధన్,ఈశ్వర్,నరేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బి.గోపాలం

## చిన్నరాజమూర్‌లో మాజీ ఎమ్మెల్యే పూజలు

**దేవరకద్ర,డిసెంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే ఆల చిన్నరాజమూర్‌కు వచ్చి స్వామి వారికి ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు అర్చకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో దేవస్థానం చైర్మెన్ రాఘవేంద్రచారితో కలసి మాజీ ఎమ్మెల్యే స్వామి వారికి అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్,దేవరకద్ర పిఏసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి నాయకులు కొండారెడ్డి,దొబ్బలి అంజనేయులు,యుగేందర్‌రెడ్డి,చల్మారెడ్డి,ఉప్పరిసత్యంలతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు అదికసంఖ్యలో పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే ఆల

## ఉద్యోగ భద్రత కల్పించాలని నిరాహార దీక్ష

**ఖిల్లాఘణపురం డిసెంబరు 18 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీలను పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల కమిటీ నాయకులు పానుగంటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర పారిశుద్ధ్య కార్మికుల పిలుపుమేరకు ఒకరోజు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు మాసములుగా పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు చెల్లించాలని అదేవిధంగా కార్మికులకు సంబంధించిన అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా కార్యక్ర మం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటాచారికి తమడిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసులు భద్రయ్య,నరసింహ,విజయలక్ష్మి, లక్ష్మినారాయణ, బిక్షపతి, సాయిలమ్మ, పుష్పతోపాటు మండలంలోని అన్ని గ్రామాల కార్మికులు పాల్గొన్నారు



కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న మండల నాయకులు

## ప్రభుత్వ పథకాలపై కళా రూపంలో అవగాహన

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో బుధవారం దామరగిద్ద మండలం బాపనపల్లి, మొగల్ మడ్క,మద్దెల్ బీడ్ గ్రామాలలో అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందజేస్తుందని,రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మద్దతు ధరకే కొంటున్నారని రైతులు కొనుగోలు కేంద్రాలనే ధాన్యాన్ని అమ్మాలని దళారుల దగ్గరికి వెళ్లి మోసపోవద్దని కళాకారులు ఆటపాటల ద్వారా తెలియజేశారు. ఆయాగ్రామాల పంచాయతీ సెక్రటరీలు,సిబ్బంది మాజీప్రజాప్రతినిధులు తెలంగాణ సాంస్కృతిక సారథికళాకారులు రవిశంకర్‌కిరణ్,నరసింహ బాలయ్యలక్ష్మి,అరుణజ్యోతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

## అసెంబ్లీలో కార్మికుల సమస్యలపై చర్చించాలి

**చిన్నంబావి,డిసెంబరు 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై చర్చ జరగాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు ప్రజా ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టినటువంటి హామీలను వెంటనే అమలుచేయాలని మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు అక్తర్ పాషా, గోపాల్, రాజు,ఎల్లయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు సమ్మె నోటీసులు అందజేసి మండల కేంద్రంలో రిలే దీక్షను నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 51 రద్దుచేసి, జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 1వ తేదీన ఇవ్వాలని అన్నారు. మంగళవారం హైదరాబాదులో జరిగినటువంటి మహా ధర్నా కు వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్మి కులను అక్రమంగా అడ్డుకున్నందుకు నిరసనగా చిన్నంబాయి మండల కేంద్రంలో నిరసన తెలియ జేస్తు ఒకరోజు రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మండల కార్మిక సంఘం నాయకులు అక్తర్ పాషా, గోపాల్, రామకృష్ణ, రాజు, ఎల్లయ్య, రామాంజనేయులు, అలివేలమ్మ సాయిలు, పద్మ, రాజేశ్వరి, వెంకటస్వామి, గోపాల్, గోవిందమ్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లోని అన్ని వివరాలను సమగ్రంగా నమోదు చేసి సర్వేను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పెదిరిపాడ్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేను దరఖాస్తుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి చేయాలన్నారు. సర్వేలో ఏమైనా అనుమానాలు వస్తే ఉన్నతాధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. రోజుకు ఎన్ని ఇండ్ల సర్వే పూర్తవుతుందని సిబ్బందిని అడిగారు. ఇంటి డాక్యుమెంట్లను ఆమె పరిశీలించారు. ఒక్క దరఖాస్తును కూడా వదలకుండా సర్వే చేయాలని చెప్పారు. అయితే కొన్ని తండాలలో కొందరు వలస వెళ్లడంతో ఇళ్లు తాళాలు వేసి ఉన్నాయని సర్వే సిబ్బంది కలెక్టర్ కు దృష్టికి తీసుకువెళ్లగా వలస వెళ్ళిన వారికి ముందస్తు సమాచారం ఇచ్చి ఒకరోజు ముందే టాంటాం వేయించి సర్వేకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే చేస్తే ప్రజలు అందుబాటులో ఉంటారని ఆమె చెప్పారు. మద్దూరు మండల కేంద్రంలో కొందరు మహిళలు గత కొన్నేళ్ల క్రితం నుంచి తాము ఇక్కడే అద్దె ఇండ్లలో నివాసం ఉంటున్నామని, తమకు ఇళ్లు కట్టుకోడానికి సొంత జాగాలు కూడా లేవని కలెక్టర్ కు విన్నవించగా స్పందించిన కలెక్టర్ స్థలాలు లేని వాళ్ళ కోసం పక్కా ఇండ్లు నిర్మించే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం మండలంలోని పెదిరిపాడ్ గ్రామంలో జరుగుతున్న సర్వేను కూడా కలెక్టర్ పరిశీలించారు. సర్వర్ సమస్య ఉందని, సర్వే నెమ్మదిగా సాగుతోందని అక్కడి సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రోజూ సర్వర్ సమస్య ఉండదని, ఉదయం, సాయంత్రం పూటలలో సర్వే చేస్తే అన్నింటికీ వెసులు బాటు అవుతుందని ఆమె సూచించారు. సర్వే యాప్‌లో సమగ్ర వివరాలను నమోదు చేస్తున్నారా ? అని అడిగిన కలెక్టర్ గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఉంటే తప్పనిసరిగా యాప్ లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మద్దూరు తహసిల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ నరసింహ రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## వేములలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**ఇటిక్యాల డిసెంబరు 18 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలలోని యువత ఆయా క్రీడల్లో ఆసక్తిని పెంచుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని బాగా ఆడి గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు షేక్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, మండల మాజీ ఎంపీపీ స్నేహ శ్రీధర్‌రెడ్డి యువతకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని వేముల గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా గ్రామ యువత ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు వారు హాజరై క్రికెట్ క్రీడను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు 50 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే పోటీలలో గెలుపొందిన జట్టుకు కీ॥శే॥ మాజీ జెడ్పిటిసి ఖగునాథ్ రెడ్డి జ్ఞాపకార్థం మొదటి బహుమతి రూ.50 వేల 16లను బహుమతిగా ఇచ్చేందుకు వారి కుమారులు రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి ముందుకు వచ్చారు. అలాగే ద్వితీయ బహుమతిగా రూ.30 వేల 16లు దాత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ముందుకు రాగా తృతీయ బహుమతి జట్టుకు రూ.15 వేల 16 లను 10 గ్రామానికి చెందిన పెద్ద గోవిందు బహుమతి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరి, పెద్ద గోవిందు, రమేష్, కాంతరెడ్డి,చిన్న గోవింద్, రమేష్, ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ దేవరాజ్, రాముడు, వెంకటేష్, కిరణ్, నగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభించిన ముఖ్య అతిథులను సన్మానించిన గ్రామస్తులు

## భూమిలేని వారికే ఆర్థికసాయం ఇవ్వాలని కార్మిక సంఘం డిమాండ్

**చిన్నంబావి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలో సెంటు భూమి కూడా లేనీ కుటుంబాలకు ప్రభుత్వం రూ. 12 వేల ఆర్థిక సహాయం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు ప్రభుత్వాన్ని చేశారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాలను గత రెండు రోజులుగా చిన్నంబావి, వీపనగండ్ల మండలాలలోని గోవర్ధనగిరి, వెలగొండ, మియాపురం, దగడపల్లి గ్రామాలలో వ్యవసాయ, ఇంటి స్థలం కూడా సెంటు భూమిలేని ,రెక్కల కష్టం, చేతివృత్తులతో బ్రతుకుతున్న పేద కుటుంబాలను సర్వే చేయడం జరిగింది. ఈ సర్వేలో సెంటు భూమిలేని పేదలందరూ కూడా దళిత, ఎరుకల,వెనుకబడిన పేద కుటుంబాలే ఎక్కువగా ఉన్నారని సర్వేలో తేలడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12,500 ఇస్తానన్న వాగ్దానని అమలు చేయుటకు సిద్ధపడ్డ తరుణంలో అర్హులైన పేదలకే ఇవ్వాలని దళారీలకు కాకుండా మరియు అనర్హులకు కాకుండా పేదలకే ఇవ్వాలన్నారు. ఆసరా పింఛన్ కు అర్హత ఉన్న కుటుంబాలను మాత్రమే గుర్తించాలని అన్నారు. మధ్య దళారీల జోక్యం ఉండకుండా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గోవర్ధనగిరి గ్రామంలో సెంటు భూమిలేని పేదలు 36 మంది ఉన్నారనీ, మియాపూర్ గ్రామంలో 27 మంది, వెలగొండ గ్రామంలో 28 మంది, మరియు దగడపల్లి గ్రామంలో 32 మంది ఉన్నారన్నారు. ఈ కుటుంబాలకు ఆయా గ్రామాల రెవిన్యూ శివారులో ప్రభుత్వ భూములను ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు, చిన్నంబావి మండల అధ్యక్షులు జి. వెంకటస్వామి, అమ్మాయి పల్లి గ్రామ నాయకుడు ఆంజనేయులు, మియాపూర్ గ్రామా నాయకులు శివుడు, ఆటో బిచ్చన్న, నీరటి శివుడు తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమిలేని పేదలను గుర్తిస్తున్న దృశ్యం

## విశేషోత్సవాలు ముగిసిన తరలివస్తున్న భక్తులు

### -స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర,డిసెంబరు 18 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల విశేషోత్సవాలు ముగిసినప్పటికి స్వామి వారి దర్శనానికి భక్తులు తరలివస్తూనే ఉన్నారు. సోమ,శనివారాలలో దేవస్థానం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నెల 13 నుండి 17 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండే గాక ఇతర రాష్ట్రాల నుండి కొన్ని వేల మంది భక్తులు స్వామి వారి ఉత్సవాలకు హాజరయ్యారు. అలాగే ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవాన్ని కనులారా కూడ తిలకించి తన్మయం చెందారు. పురోహితులు శాస్రోక్తంగా ఈ పవిత్ర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరణలో స్వామి వారు దేవస్థానం ఆవరణలో వివిధ సేవలలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్,వంశపారంపర్య ధర్మకర్త రాఘవేంద్రచారి,ఈఓ కవిత,మేనేజర్ ప్రసాద్‌లతో పాటు పురోహితులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకరకాల పూలతో పాటు వివిధ ఆభరణాలతో సార్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కూడ అలంకరించారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద వివిధ తినుబండారాలు,ఆటవస్తువులు,వంటసామగ్రి తదితర దుకాణాలు వెలిశాయి. చిన్నరాజమూర్‌లో వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిర భక్తులు ఉపవాసదీక్షలతో వచ్చి స్వామి వారికి దాసంగాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకొంటున్నారు. తీపివంటకాలతో స్వామి వారికి నైవాధ్యాలు సమర్పిస్తున్నారు. దీంతో దేవస్థానం పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వివిద ప్రాంతాలనుండి భక్తులు ట్రాక్టర్లు,ఎద్దుల బండ్లు,వివిద వాహనాలలో చిన్నరాజమూర్‌కు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సందర్భంగా దేవస్తానాన్ని వివిద రంగురంగుల విధ్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.

## సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వీపనగండ్ల డిసెంబరు 18 ప్రభాతవార్త :** వీపనగండ్ల గ్రామానికి చెందిన పదిమంది లబ్ధిదారులు కు బుధవారం నాడు 29500 రూపాయల సీఎం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీపనగండ్ల మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య ,కిసాన్ సేలు మండల అధ్యక్షుడు వంగల వెంకటరెడ్డి ,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు ,నాయకులు రవీందర్ రెడ్డి, రఘు ,గోపి , బత్తుల యాదయ్య ,వెంకట్ రెడ్డి ,వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలు అనారోగ్యాలకు గురవుతూ వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు ఆరోగ్య కేంద్రాలకు చూయించుకోవాలని దయనీయ స్థితిలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు దీనికి సరఫరాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలియజేయగా వారికి ఆ నిధి ద్వారా ఆర్థిక సాయం వచ్చే విధంగా కృషి చేశారని వారు తెలిపారు. గ్రామంలోని వారికి కుమ్మరి బొడ్డుపల్లి నరసింహ 50,000 ,కాన మోని శ్రీనివాసులు 35,000 ,కుమ్మరి బొడ్డుపల్లి విష్ణు 33,000 ,కటిక శ్రీనివాసులు 23,500 ,జల్లు సోని 23.500, కేతపల్లి శీను 15.000 ,యు. జ్యోతి 12,000, దయ్యం పెంటయ్య 6000 ,మీసాల బాలమ్మ 6000 ,బి ఎల్లమ్మ 5500 లకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సగనమోని వెంకటస్వామి అలియాస్ వైయస్ కావలి మహేష్ నాయుడు పాల్గొనడం జరిగింది.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కంగ్రెస్ కార్యకర్తలు

## ఇళ్లు లేని నిరుపేదలకి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

### యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నేనావత్ మోహన్ నాయక్

**బాలానగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని మహబూబ్ నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మోహన్ నాయక్ అన్నారు. బుధవారం ఈ మేరకు బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశానుసారం, ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు అత్యంత పారదర్శకంగా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమన్వయంతో సర్వే నిర్వహిస్తున్నట్లు మోహన్ నాయక్ తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా తిరుమలగిరి గ్రామ పంచాయతీలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యే విధంగా నిష్పక్షపాతంగా సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు మొబైల్ యాప్ లో నమోదు చేసే తీరును ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. ఇంటి స్థలం ఉన్న పేదవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయక్ తో పాటు సర్వేయర్ రమేష్, తిరుమలగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగం, మాజీ సర్పంచ్ హన్మంతు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుమలయ్య, మల్లేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

## నేడు విద్యుత్ అంతరాయం

**రాజాపూర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలో నేడు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని రాజాపూర్ మండల ఏఈ వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుచ్చర్ కల్ చేన్నవెల్లి నర్సింగ్ తాండ గ్రామాలకు నూతనంగా 132 కెవి టవర్ పనుల నిమిత్తం నేటి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## ధన్వాడలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**ధన్వాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి పరిశీలించారు. అర్హులైన వారిని గుర్తించి ఇండ్ల జాబితాను తయారు చేయడం జరుగుతుందని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వారందరు ఇండ్ల సర్వేకు వచ్చే అధికారులకు వివరాలు అందించాలని కోరారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో సర్వే చేయడం జరుగుతుందన్నారు. అందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

## రూ.2679 ధర పలికిన ఆర్ఎస్ఆర్

**దేవరకద్ర,డిసెంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుదవారం రైతులు 67 కింటాళ్ళ ఆర్ఎస్ఆర్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2679 ధర పలికింది. అతి తక్కువగా రూ.2609 ధర పలికింది. అలాగే 18 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.8159 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.7689 ధర పలికింది. అలాగే 55 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి కింటాల్‌కు అత్యధికంగా రూ.3610 ధర పలికింది. అతి తక్కువగా రూ.1700 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలి

### ఆర్డీవో రామ్ చందర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆర్డీవో రాంచందర్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 ముందస్తు కార్యకలాపాలను ఆర్డీవో వివరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు తహసీల్దార్ అమరేందర్ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపల్లిలో ముగిసిన పోచమ్మదేవత బ్రహ్మోత్సవాలు

**దేవరకద్ర,డిసెంబరు 18 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పుట్టపల్లిలో మంగళవారం రాత్రి పోచమ్మదేవత బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ నెల 16 నుండి గ్రామదేవత శ్రీ పోచమ్మదేవత నాభిశిల(బొడ్రాయి)వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గుడి ముందు పచ్చని పందరి వేసి ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు నిర్వహకులతో పాటు గ్రామస్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇంటింటి సర్వే ప్రారంభం



ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, డిసెంబరు 18 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం గోపన్‌పల్లి లో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కుమ్మరి రాంబాబు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా లబ్ధిదారులను ఫోటోలు దింపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పరశురాం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు, అనంత విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఫకీరన్న, రామస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

■ జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం దామరగిద్ద మండలం మొగుల్ మడ్క జడ్పీ హైస్కూల్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లసర్వ్ తనిఖీ చేసి సర్వ్ వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ జ్యోతి, ఎంపీడీవో సాయిలక్ష్మి పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## బాధ్యతగా నర్సరీ సంరక్షణ చేపట్టాలి: అడిషనల్ డిఆర్డిఓ



ఉపాధి నర్సరీ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

**చిన్నంబావి, డిసెంబరు18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టదలచిన కమ్యూనిటీ సైనిటరీ కాంప్లెక్స్ మార్కెట్‌ను అడిషనల్ డిఆర్డిఓ నాగేంద్రం పరిశీలించడం జరిగింది. గ్రామాలలో నర్సరీ పనులను పరిశీలించి విత్తనాలు వేసిన పిదప సకాలంలో రానిఎడల తిరిగి విత్తనాలు వేయాలని సూచించడం జరిగినది. మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, టిఏలకు ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేట్లకు రివ్యూ మీటింగ్ తీసుకో వడం జరిగినది. ముఖ్యంగా ఉపాధిహామీ పనులు సద్వినియోగం అయ్యేవిధంగా పనులు కల్పించాలని, ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్ ను పూర్తి చేసుకోవాలని ఆదేశించడం జరిగినది. ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని నర్సరీలలో ఖచ్చితంగా రికార్డులు ఉంచుకోవాలని నర్సరీల సంరక్షణలో ఏమాత్రంఅలసత్వం వహించకుండాచూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రమణారావు, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, టిఎలు, ఎఫ్‌లు పాల్గొనడం జరిగినది.

## సమగ్రా శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

■ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గోపాల్




మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గోపాల్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న 19600 మంది ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతును తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్య లు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న19600 మంది ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను గత20 సంవత్సరాలుగా ప్రభుత్వం వెట్టిచాకిరి చేసుకుంటుంద్నారు. ప్రభుత్వం వీరిని విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం మద్దతుగా ఉంటుందని అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఉద్యోగులంతా ఐక్యమత్యంగా ఉండి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేయాలన్నారు. ప్రతి సమస్య ఉద్యమంతోనే పరిష్కారమైందన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లాఅధ్యక్షులు జి.వెంకట్రామారెడ్డి, వెంకటప్ప, బిఆర్ఎస్ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

## క్రీడాలకు పుట్టినిల్లు ధన్వాడ

■ జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి వెంకటేష్ శెట్టి



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

**ధన్వాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త:** క్రీడాలకు పుట్టినిల్లు ధన్వాడ అని ఇక్కడ ఎంతో మంది క్రీడాకారులు వివిధ ఆటల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం జరిగిందని జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి వెంకటేష్ శెట్టి అన్నారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ శెట్టి మాట్లాడుతు విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించే విధంగా ప్రభుత్వం ప్రోత్సాహన్నిస్తుందన్నారు. అందుకు విద్యార్థులు కష్టపడి క్రీడల్లోను రాణించి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అదే విధంగా ధన్వాడ మండలానికి చెందిన విద్యార్థునులే కుస్తీ పోటీల్లో జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావడం జరిగిందన్నారు. సీఎం కప్ క్రీడల్లో నెట్‌బాల్ బాస్కెట్బాల్, రుస్తీ ఫుట్‌బాల్, చెస్‌పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో నెట్‌బాల్ పోటీల్లో మొదటి బహుమతి ధన్వాడ మండ లం, రెండవ బహుమతి గుండుమాల్ మండలానికి వచ్చింది. మహిళల విభాగంలో గుండుమాల్ మండలానికి మొదటి బహుమతి. రెండవ బహుమతి ధన్వాడ మండలానికి లభించింది. అదేవిదంగా ఫుట్‌బాల్ పోటీల్లో ధన్వాడ మండలానికి మొదటి ఇహుమతి, రెండవ బహుమతి మద్దూర్ మండలానికి లభించింది. మహిళల విభాగంలో నారాయణపేట్ మండలానికి మొదటి బహుమతి లభించింది.

## అయిజలో సందడి చేసిన సినీనటి డింపుల్ హాయాతి



**అయిజ డిసెంబరు 18 ప్రభాతవార్త :** సినీనటి డింపుల్ హాయతి బుధవారం పట్టణంలో సందడి చేసింది ఇందులో భాగంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ఆమెను చూసేందుకై స్థానికులతో పాటు మండల పరిసర ప్రాంత ప్రజలు యువకులు షాపింగ్ ఆవరణలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో అక్కడ సందడి ఏర్పడింది. ఆమె స్థానిక ప్రజాప్రతి నిధులతో కలిసి షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టేజిపై డాన్స్ వేసి అందరినీ అలరించింది అయిజ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద షాపింగ్ మాల్ ఏర్పడడంతో దానికి తోడు సినీ తార రావడంతో పట్టణంలో యువకులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు సంకాపురంరాముడు, మాజీ జెడ్పిటిసి నరసింహారెడ్డి, స్థానిక పోలీస్ సిబ్బంది సిఐ, ఎస్సైలతోపాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన



**వనపర్తి టౌన్ డిసెంబరు 18 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెద్దమందడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కార్మికుల నేతలు గట్టమ్మ, మజీద్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల కార్మికులు మూడు నుండి ఐదు నెలల వరకుజీతాలు అందలేదని తెలిపారు. పనినిర్వహణకు అవసరమైన నిత్యావసర సామగ్రి, సబ్బులు, నూనెలు, ఇనుప సామగ్రి కూడా అందడం లేదని అన్నారు. ఈ పరిస్థితి పంచాయతీ కార్మికుల జీవనాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనేస్పందించి పెండింగ్ జీతాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదనంతరం వారు ఆర్ఐ గణేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో 23గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

## కోటకొండలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

**నారాయణపేట టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను బుధవారం పేట మండలం కోటకొండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రాజు, ప్రభంజన రావు, గ్రామపంచాయతీ కార్యదర్శి చాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇండ్లులేని వారికి ఇండ్లు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. అన్ని వర్గాల వారికి న్యాయం చేయడం కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే సాధ్యమన్నారు. ఇల్లులేని వారందరికీ కాంగ్రెస్ అధికారంలో ఇల్లు వస్తాయన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిల్ కలెక్టర్ నరసింహ, నాయకులు బాలప్ప మన్యంతో బాటు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

■ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి జబ్బర్



**వీపనగండ్ల డిసెంబరు 18 ప్రభాతవార్త:** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరిగింది అయితే గురువారం నాడు దీక్ష శిబిరానికి హాజరై వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీలను ఏవైతేఉన్నాయో అధికారంలోకి వచ్చినతర్వాత ఇప్పటివరకు కొన్ని హామీలను నెరవేర్చిన మిగతా హామీలు నెరవేర్చలేదని వాటిని నెరవేర్చడం అందుకోసం కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండీ జబ్బర్ అన్నారు మాట్లాడుతూ పోరాటం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారమైతాయని అన్నారు. లబ్ధిదారులు అడుగుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, స్థలం లేని వారికి స్థలం కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు, మొత్తం కలిపి 15లక్షల రూపాయలు ఇల్లు నిర్మించడానికి ఇవ్వాలనివారు డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల సంక్షేమ పథకాలు అమ్ములు కాకపోవడంతో చాలా ఇబ్బందులు గురవుతున్నారు. కాబట్టి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఆసరా, వితంతు, ఒంటరి, మహిళల పెన్షన్లు కూడా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో కంప చెట్లు, అపరిశుభ్రత ఉన్నాయని దీనివల్ల గ్రామంలో ప్రజలు రోగుల బారిన పడుతున్నారు. శుభ్రత, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. డ్రైనేజీ, సిసి రోడ్లు నిర్మించాలని. ఈ సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని వారుహెచ్చరించారు. రిలే నిరాహార దీక్షలకు తహసిల్దార్ కార్యాలయం ఆర్ఐ కురుమూర్తి గారు, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ గారు దీక్షల దగ్గరకు వచ్చి సిపిఎంగ్రామ కమిటీ ఇచ్చిన వినతి పత్రం తీసుకొని పై అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెద్దకాజా, గ్రామ మాజీ సర్పంచ్ కాంతమ్మ, గ్రామ కార్యదర్శి రవి ప్రసాద్, గ్రామ నాయకులు ఎల్ఐసి వెంకటస్వామి, ఖాజా హుస్సేన్, మౌలాలి, రేవతమ్మ, శ్రీనివాసులు, కృష్ణయ్య, సరోజ, బిచ్చన్న, వెంకటేష్, శంకర్, శేఖర్, చిన్న రజాక్, కాజా, హైమద్, వెంకటస్వామి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లా అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

ఎన్‌హెచ్‌పిఎస్ జిల్లా చైర్మన్ గొంగల్ల రంజిత్ కుమార్



కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న రంజిత్ కుమార్, న్యాయ వాదులు

**గద్వాల డిసెంబరు 18 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో నూతన కోర్టు భవన సముదాయాల నిర్మాణం స్థలం విషయంలో ఏర్పడ్డ అనిశ్చితి తొలగి గతంలో నిర్ణయించిన స్థలం ఎంతో ముందు చూపుతో ,భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉందని నడుగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్ కుమార్ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మన పెద్దలు గాంధీ చౌక్ వద్ద కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిని ఊరికి కాస్త దూరమైనా పెద్ద విస్తీర్ణంలో నిర్మాణం చేయడం, పాత బస్ స్టాండ్ నుంచి కొత్త బస్ స్టాండ్ దూరంగా తరలించడం, ఊరికి దూరంగా ఉన్నా ఇరిగేషన్ కార్యాలయాలు, ఆర్డీఓ ,తహశీల్దార్, పెద్ద విస్తీర్ణంలో ప్రధాన రహదారుల వెంబడి ఏర్పాటు చేయడం వంటి ముందుచూపు నిర్ణయాల వల్ల నేడు జిల్లా కేంద్రం ఏర్పాటు జరిగినా, ఎక్కడాస్థలాల కొరత, భవనాల కొరత ఏర్పడలేదన్నారు. వాటికి అనుగుణంగా నూతన కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం చేయించి తీసుకున్న నిర్ణయాలు అభివృద్ధి కి దోహదపడుతున్నాయి అన్నారు. త్వరలోనే ఆచరణకు నోచుకొనున్న శక్తినగర్ ఎర్రవల్లి రోడ్ విస్తరణ అనంతరం నందిన్నె నుంచి భారతమాల రోడ్డుకు అనుసంధానం జరిగి ప్రస్తుతం అనంతపురం వద్ద నూతన కోర్టు కాంప్లెక్స్ ఎంపిక చేసిన స్థలం ముఖ్యమైన ప్రాంతంగా మారుతుందన్నారు. పలువురు మేధావులు, పెద్దల సూచన మేరకే ఇలా ఎన్నో ప్రయోజనాల కోసమే గతంలోనే ఈ స్థలాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్, పలువురు సీనియర్ న్యాయవాదులు ,ప్రజా సంఘాల నేతలు చూపిన చొరవతో వాస్తవాలను వివరించడంతో స్థలం ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం రావడం తో పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు హర్షంవ్యక్తం చేశారు. బుధ వారం రంజిత కుమార్ న్యాయ వాదులుపూజారి శ్రీధర్, కొండాపురం షఫీఉల్లా, కవిరాజులతో పాటు మరి కొంతమంది న్యాయవాదులతో కలిసి కలిసి అనంతపురం వద్ద కోర్టుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం చాలాబాగుందని, ఇక్కడ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

## అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తింప జేయాలి

◆ డీసీసీబీ పరిధిలో మిగిలిన రైతులకు రుణమాఫీ ఇవ్వాలి ◆ పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి




డీసీసీబీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబరు18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రుణమాఫీ పథకంలో భాగంగా మిగిలిపోయిన రైతులందరికీ రుణమాఫీ ఇవ్వాలని కల్వకుర్తి పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పాలమూరు జిల్లా కేంద్రంలో జరిగిన మహబూబ్‌నగర్ మహాజనసభలో డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి రైతు రుణమాఫీకి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలలో ఋణ మాఫీ కానీ రైతుల జాబితా ఇచ్చామన్నారు. కల్వకుర్తి డీసీసీబీ బ్రాంచ్‌లో రుణమాఫీ కాకుండా మిగిలిన రైతులు చాలా మంది కార్యాలయం చుట్టూ తిరిగుతూ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. డిసిసిబి చైర్మన్ వెంటనే స్పందించి రుణమాఫీ కానీ రైతుల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి వెంటనే రుణమాఫీ వర్తింపజేస్తానన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి, రంగాపూర్, చారకొండ, మిడ్జిల్ పీఏసీఎస్‌ల చైర్మన్‌లు జనార్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గురువయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన స్వామివివేకానంద సేవ బృందం అధ్యక్షుడు



కిషన్‌రెడ్డిని కలిసిన స్వామివివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివకుమార్

**కల్వకుర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివకుమార్ ఢిల్లీలో సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు, కేంద్రబొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఒకటే దేశం ఒకటే ఎన్నికలుపై చర్చించి, దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వలన కలిగే లాభాలుపై తెలంగాణ రాష్ట్రం నుంచి మాట్లాడి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కిషన్‌రెడ్డి ఒకటే దేశం, ఒకటే ఎన్నికలపై అంగీకారం తెలిపారు. శివ కుమార్ మాట్లాడుతూ దేశం మొత్తంలో వివిధ రాష్ట్రాల నుంచి సేవ రంగంలో కృషి చేస్తున్న యువత అంత కలిసి సంవిధాన్ సపోర్ట్ అనే బృందంగా కలిసి దేశం మొత్తంలో ఉన్న పార్లమెంట్ సభ్యులను పార్టీలకతీతంగా కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. శివ కుమార్ రైతులకి అలాగే సమాజంలో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించడంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, సంవిధాన సపోర్ట్ సభ్యుడు మౌళి కిషోర్ కూడా పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతం కోసం కృషి చేద్దాం

**వెల్దండ, డిసెంబరు18 ప్రభాతవార్త:** గ్రామాలలో బిజెపి పార్టీ బలోపేత కోసం కృషి చేద్దామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అందోజు శ్రీనివాస్‌చారి అన్నారు. మండలంలోని అజిలాపూర్ గ్రామంలో 140,141వ బీజేపీ బూత్ కమిటీని సింగిల్‌విండో మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, శ్రీనివాసచారిఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షునిగా చంద్రశేఖర్, మల్లేశులను ఎన్నుకొని శాలువాలతో సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, పెద్దయ్య గౌడ్, నిరంజన్‌గౌడు, శేఖర్, రమేష్, రాజు తదితరులు ఉన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలి

-సిఐటియు జిల్లా కోశాధికారి జి అశోక్



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి.అశోక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని ఏవో. చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా వేతనాలు లేవని దీనితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు చేస్తూ జీవనం వెళ్లబుచ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అరకొర వేతనాలు కూడా సకాలంలో రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. వంట మనుషులుగా పనిచేస్తున్న వారందరికీ కాటన్ దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మధు, తారా సింగ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, డిసెంబరు18 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని అలాగే బియ్యాన్ని పరిశుభ్రంగా కడిగి నాణ్యమైన కూరగాయలను ఆకుకూరలను మార్కెట్లో కొనుగోలు చేయాలని తహసిల్దార్ నరేందర్ వంట ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండిపెట్టిన మధ్యాహ్న భోజనాన్ని ఆర్ఐ భీమ్‌సేన్‌రావుతో కలిసి పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యాన్ని అలాగే నీటి కుళాయిలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు భోజనం వడ్డించగా విద్యార్థులు తింటున్నాం భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు డైట్ చార్జీలను కూడా పెంచిందని పెంచిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఆకుకూరలు. కూరగాయలు. గుడ్లు. అరటిపళ్లను కొనుగోలు చేసి తీసుకురావాలని వంట ఏజెన్సీలను ఆదేశించారు. గోధుమ ద్వారా వచ్చే నాణ్యమైన బియ్యం లేకపోతే తిరిగి వాపస్ ఇచ్చి మంచిగా ఉన్న బియ్యాన్ని తెచ్చుకోవాలనిపాఠశాల ప్రధానోపాధ్యాయునికి సూచించారు. పెంచిన డైట్ చార్జీల ప్రకారం విద్యాశాఖ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండి పెట్టాలని వంట ఏజెన్సీలకు సూచించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, డిసెంబరు18 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన సామ పుల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ విషయం తెలుసుకొని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గండికోట రాజు ద్వారారూ.5 వేలను మృతురాలి కుటుంబానికి అందించారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగాఅండగా ఉంటామనిభరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

**ధన్వాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో బుధవారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించిన ఆయ్యప్ప స్వామి పడిపూజలో స్వామి వారికి అభిషేకం, మెట్లపూజలు నిర్వహించారు అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమ్రోగింది. అంతకుముందు గ్రామంలో పూర వీధులగుండా అయ్యప్ప స్వాములు భజనలు, కీర్తనలు, నృత్యాలతో ఊరేగించారు. దేవాలయం ఆవరణలో నిర్వహించిన పూజలో డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం శివకుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అన్నదానం చేపట్టారు. మండలంలోని వివిధగ్రామాల నుంచిభక్తులుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

**ఉప్పునుంతల డిసెంబరు 18 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లాల్ పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని వెల్టూరు, సిబిఐ తాండలో వారు పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వారి ఆధార్ కార్డు తదితర వివరాలను సేకరించారు. అందరి వివరాలను పరిశీలించి అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్లకోసం ఎంపిక చేసి ప్రభుత్వం అందజేసిన ప్రత్యేక యాప్ లో అప్లోడ్ చేయడంజరుగుతుందని ఎంపిడిఓ మోహన్‌లాల్ వివరించారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహించిన సర్వేతోనిజమైన అర్హులకు న్యాయం జరుగుతుందని ఎంపిడిఓ వివరించారు. ఈ సర్వేలో ఎంపిడిఓ మోహన్‌లాల్ తో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

**పెబ్బేరు డిసెంబరు18 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు పంపిణీ చేసిన స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి కుట్టు శిక్షణ పొందిన వారు సొంతంగా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎవరి మీద ఆధారపడకుండా సొంతంగా జీవించాలని కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసుకుని స్వయంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విహారి కృష్ణ, శ్రీరామ్ కిషోర్, ఇన్స్ట్రక్టర్ దేవేంద్రమ్మ, శిక్షణ పొందిన మహిళలు జ్యోతి, జి.కరుణశ్రీ, సరోజ, శారద, సువర్ణ, పుష్పలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా

## వరి ధాన్యం కొనుగోలు చేయాలి

**తెలకపల్లి, డిసెంబ 18 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసిల్దార్ జాకీర్ ఆలీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రెండవ గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పర్వతాపూర్ గ్రామానికి చెందిన సుజాత గిరిధర్‌రెడ్డి రైతు దగ్గర 300 బస్తాలు 120 క్వింటాలు, నడిగడ్డ గ్రామం 14 మంది రైతుల నుండి 1151 బస్తాలు 460 క్వింటాల్ 40 కేజీలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్ ఫైనాన్స్, ఏపీఎం నిరంజన్, సిసి నరసింహ, వీఓఏ ఫర్వాబేగం రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడకు ఎంపిక

**లింగాల డిసెంబరు 18 ప్రభాతవార్త:** మండలంలోని అంబట్‌పల్లి గ్రామానికి చెందిన ఎండి సాధిక్ మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని జిల్లా స్థాయిఖోఖో సిఎం కప్ పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయి ఖోఖో ఆటలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడకు ఎంపిక కావడంతో బుధవారం కుటుంబ సభ్యులు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## ముగ్గురు పేకాట రాయుళ్ళ అరెస్టు

**మక్తల్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని జక్లేర్ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మక్తల్ ఎస్ఐ వై. భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ దాడిలో మొత్తం 7 బైకులు, మూడు సెల్ ఫోన్లు, రూ.3740/ల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, జూదం, కోడిపందాలునిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## రెవెన్యూ వనపర్తి జిల్లా అధ్యక్షునిగా లక్ష్మికాంత్

**పెబ్బేరు డిసెంబరు 18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపతహశీల్దార్ లక్ష్మీకాంత్ తెలంగాణరెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ వనపర్తి జిల్లా అధ్యక్షునిగా, ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర రావు నియామకాయన సందర్భంగా బుధవారం రోజు పెబ్బేరు తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది మదన్, సురేష్, శ్రీనివాసులు, పరమేష్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ నాయకులు రమేష్ ,ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**నారాయణపేట టౌన్, డిసెంబరు18 ప్రభాతవార్త:** నారాయణ పేట్ జిల్లా కేంద్రంలో శీల గార్డెన్ లో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 350 మందికి మహిళలకు నిత్యావసర సరుకులను సిఐ శివశంకర్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలోమహిళలు, విద్యార్థినిలు ఎవరైనా వేధింపులకు గురైన ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ చేసిన వెంటనే జిల్లా షి టీమ్ పోలీసులను సంప్రదించాలన్నారు. పేట జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీస్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఈవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ మొదలగు వాటిపై అవగాహనకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది, ప్రతి కళాశాలలో స్టూడెంట్స్, లెక్చరర్స్ తో కలిసి యాంటీ ర్యాగింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. షీటీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఎలాంటి వేధింపులకైన గురయ్యే మహిళలు షీటీంకు ఫిర్యాదు చేయదలచుకునే మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ,ఈకార్యక్రమంలో ఓఎంఐఎఫ్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఏంజెల డెవిస్, ఓఎంఐఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్లు హాజమ్మ, నారాయణ, మండల కోఆర్డినేటర్ నర్సింహా, ఎల్లప్ప, ఆశమ్మ, కృష్ణ, పౌల్, ఈశ్వప్ప, ఈశ్వరమ్మ, అనురాధ, ఎల్లప్ప, రాములు, శాంతప్ప మరియు జోగిని మహిళలు, హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

## పెదిరిపాడ్ కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**మొదటిపేజీ తరువాయి భాగం..**

ఆర్వో ప్లాంట్ మరమ్మతు చేయించాలని, మిషన్ భగీరథ తాగునీటి పైప్ లైన్ ను పాఠశాలకు వేయించాలని, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ ఫార్మర్ ను కూడా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తహసిల్దార్ మహేష్ గౌడ్ కు సూచించారు. అలాగే బోరు నీటిని ల్యాబ్ కి పంపించి పరీక్షించాలని తెలిపారు. ఆ తరవాత పాఠశాలలోని ఫిర్యాదుల పెట్టెలో విద్యార్థులు రాసి వేసిన రెండు ఫిర్యాదులను కలెక్టర్ చదివారు. కొందరు టీచర్లు తమను బేధ భావంతో చూస్తున్నారని విద్యార్థినిలు ఆ ఫిర్యాదులలో రాశారు. ఇది చదివిన కలెక్టర్ మరోసారి విద్యార్థినులతో ఇంట్రాక్ట్ అయ్యారు. చిన్న చిన్న సమస్యలను పట్టించుకోకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని, చదువుపై దృష్టి పెట్టాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని సూచించారు. టీచర్లు కూడా విద్యార్థినులందరినీ సమాన దృష్టితో చూడాలని కోరారు.

## ధాన్యాన్ని సక్సెస్ ఫుల్ బిడ్డర్‌కు అప్పగించాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్ష్ సురభి



అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 18 ప్రభాతవార్త:** 2022-23 రబీ సీజన్ వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన మిల్లర్లు వెంటనే సక్సెస్ ఫుల్ బిడ్డర్‌కు అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్ష్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్ వేలం వేసిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు సక్సెస్‌ఫుల్ బిడ్డర్‌కు అప్పగించాలని ఆదేశించారు.. ఈ విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయంలో సహకరించిన మిల్లర్లకే రాబోయే రోజుల్లో ధాన్యం ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ సైన్స్ అవార్డుకు ఎంపికైన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రావు

**తెలకపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్న ముద్దునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు తలుపునూరు రాజశేఖర్ రావు జాతీయ ఉత్తమ సైన్స్ అవార్డుకు ఎంపిక కావడంపై బుధవారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ తో పాటు జిల్లా విద్యా అభిమానులు మండల విద్యాధికారి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. 5వ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ 2025 బిఎస్‌టిఎఫ్ ఈవెంట్ మధ్య ప్రదేశ్ రాష్ట్రం లో భోపాల్ రాజదానికి దగ్గరలో ఉన్న బుర్హాన్ పూర్‌లో జనవరి నెల9వ తేదీ నుండి 11 వ నిర్వహించనున్నారు ఈబి ఎస్‌టిఎఫ్ 2025 నిర్వహణలో భాగంగా జాతీయ ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డును మన తెలంగాణ రాష్ట్రానికి చెందిన నాగం కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం చిన్న ముద్దు నూర్ పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు టీ. రాజశేఖర్ రావుకు ప్రకటించడం ఎంతో హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమానికి దేశంలో వున్న ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శాస్త్రీయ దృక్పథం పై అవగాహన కల్పించడం కోసం దేశంలో దాదాపు 20 రాష్ట్రాలలో చురుకుగా పనిచేస్తూ దేశ వ్యాప్తంగా అనేక సైన్స్ కార్యక్రమాలు నిర్వహించడం లో భాగంగా భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. నేషనల్ టీచర్ సైంటిస్ట్ కౌన్సిల్, రామన్ సైన్స్ టెక్నాలజీ ఫౌండేషన్ ,సర్దార్ పటేల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఇండియన్ ప్లానెటరీ సొసైటీ (ముంబయి), బాబా నేషనల్ రీసెర్చ్ ఆకాడమి నేషనల్ చిల్డ్రన్ మాథ్స్ అకాడమీ (ఇండియా), డా. అబ్దుల్ కలామ్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ యంగ్ సైంటిస్ట్ ఇండియా మొదలగు సంస్థలు కలిసి దేశ వ్యాప్తంగా విద్యార్థుల మధ్య సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. దేశంలో ఒకే ఒక జాతీయ ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డు మన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖర్ అందుకోనున్నారు. ఈ కార్యక్రమానికి రామన్ సైన్స్ టెక్నాలజీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సివి జోషి, ఇస్రో శాస్త్రవేత్త దిలీప్ భట్ , ఆల్ ఇండియా మాథ్స్ గురుగా పిలువబడే బిఎన్ రావు చేతుల మీదుగా రాజశేఖర్‌రావు ఈ ఆవార్డును అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యశాఖాధికారి రమేష్ కుమార్ అభినందించి ప్రశంసించారు.

## బస్సు యాత్ర వాల్ పోస్టర్లు విడుదల

**బిజినేపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం నూ. 18 వేల ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పి హెచ్ సి మందు ఆశ వర్కర్లతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చెన్నమ్మ మాట్లాడుతూ రాష్ట్ర బస్సు యాత్ర ఈనెల 15 నుండి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఆషాలను చైతన్యం చేస్తూ ఈ జాత రాష్ట్రంలో నలుమూలల తిరగడం జరుగుతుంది అని వివరించారు. ఈ జాత ఈనెల 24న నాగర్ కర్నూల్ చేరుతుంది అని జాతకు స్వాగతం పలుకుతూ ఆశ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అషాలతో పని చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రలలో ఇస్తున్నట్లు ఫిక్స్ వేతనం 18000 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశ వర్కర్లు పనిచేస్తున్నారు గత 30 సంవత్సరాల నుండి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ గత 20 సంవత్సరాల నుండి ఆశలు ఎన్ హెచ్‌ఎం స్కీముల్లో భాగంగా పనిచేస్తున్నారు అని వివరించారు. కరోనా లాంటి మహమ్మారి కాలంలోకూడా ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలు అందించారు. డబ్ల్యూవాచ్ఓ సంస్థ ఆశా వర్కర్లకు గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డును కూడా అందించింది. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం ఆశాలను నేటికీ గుర్తించడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించి, లెప్రసి సర్వే డబ్బులను వెంటనే చెల్లించి, పనికి తగ్గ పారితోషకం కాకుండా కనీస వేతనాలు అమలు చేసి, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొదిలి రామయ్య ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వరలక్ష్మి జయమ్మ అధ్యక్షురాలు కళావతి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం దశరథం, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, శివ లీల, చెన్నమ్మ, ఒకుల, వెంకటమ్మ, శివ లీల, మమత, బేగం తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

**వెల్దండ, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బాణావత్ కేస్లీ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తారా సింగ్, శ్రీను నాయక్, హనుమంత్, లక్ష్మిపతితో పాటు తదితరులు ఉన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

**భూత్పూర్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ప్రమాదశాత్తు మంగళవారం రాత్రి భూత్పూర్ మండలం పాతమొల్గర గ్రామ చెరువులో పడి మునిగి ఓ యువకుడు చనిపోయాడు. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం ఖిల్లాఘనపూర్‌కు చెందిన మున్నూరు కాపు కులానికి చెందిన పోలిశెట్టి చిన్న చెన్నయ్య కుమారుడు పోలిశెట్టి శ్రీను(33)అనే యువకుడు పాతమొల్గర వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో ఉన్న వలకు చిక్కుకుని ఊపిరాడక చనిపోయాడని తెలిపారు. మృతుడి తల్లి పోలిశెట్టి చిన్న వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## గ్రామంలో ఉన్న కరెంట్ సమస్యలను పరిష్కరించండి

**వనపర్తి టౌన్ డిసెంబరు 18 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్‌ను అంబేద్కర్ కాలానికి చెందిన రైజింగ్ హాండ్స్ సొసైటీ వారు మర్యాద పూర్వకంగా కలిసి పూలబోకే ఇచ్చిశాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమం అనంతరం ఏఈ సుధాకర్ గ్రామ విధుల్లో పర్యటించారు. బస్టాండ్ నుంచి ఎస్సీ కాలనీ వరకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, తీగలు వదులుగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, హై ఓల్టేజ్ కరెంట్ సమస్యతో కాలనీ ప్రజలు ఇబ్బందీ పడుతున్నారని తెలిపారు. సమస్య కోసం ఎన్ని వినతిపత్రాలు ఇచ్చిన ఎవరు పట్టించుకోవడం లేదని రైజింగ్ హాండ్స్ టీం ఏఈ సుధాకర్ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చూస్తామని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

# స్థలాల కేటాయింపులో ప్రాధాన్యతను గుర్తించాలి

◆ పిజెపి కాలనీలోనే కోర్టులకు స్థల కేటాయింపు జరగాలి

◆ న్యాయవాదుల నిరసన దీక్షలో వక్తులు



న్యాయవాదుల దీక్షకు మద్దత్తు ఇస్తున్న అశ్విని, నర్మదారెడ్డి,మోహన్ రావు, నళిని, క్రాంతి కుమార్

**గద్వాల డిసెంబరు 18 ప్రభాతవార్త :** పిజెపి కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆస్తి ప్రజలకు అత్యధిక ప్రయోజనాన్ని కలగజేసే వాటికోసం ఉపయోగించబడాలని వక్తలు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా న్యాయస్థాన సముదాయ నిర్మాణ కోసం పూడురు గ్రామ శివారులో స్థలాన్ని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తు గద్వాల బార్ అసోసియేషన్ బుధవారం నుండి రిలే నిరసన దీక్షలను ప్రారంభిం చింది. అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ రఘురామి రెడ్డి అధ్యక్ష ప్రారంభమైన ఈ దీక్షలకు తొలి రోజు బిఆర్ఎస్ నేతలతో పాటు గద్వాల వైద్యుల సంఘం, జిల్లా ఆర్యవైశ్య సంఘం, సీనియర్ సిటిజన్ ఫోరమ్ లు మద్దతుగా ఫలికాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అత్యధిక సంఖ్యలో ప్రజలు వచ్చి పోయేది న్యాయ స్థానాలకే అటువంటి న్యాయ స్థానాలకు స్థల కేటాయింపులో ప్రభుత్వం వివక్షతను కనబరచడం అత్యంత సోచనీయమన్నారు. ప్రజల మధ్య ఉండాల్సిన న్యాయస్థానాలను గుట్టలకు పంపించి బయట ఉన్న సరిపోయే కార్యాలయాలను లోనికి తెచ్చారన్నారు. పిజెపి కాలనీలో ఉన్న 59 ఎకరాలను జిల్లా యంత్రాంగం ఇష్టారీతిన వాడుకున్నదన్నారు. ఫలితంగానే అత్యధిక జనసంచారం కలిగిన న్యాయస్థానాలకుస్థల కేటాయింపులో జాప్యం జరుగుతున్నది అన్నారు. పట్టణానికి సమీపంలో ఉండాల్సిన న్యాయస్థానాలను అనంతపురం గుట్టలకు ఎట్టి పరిస్థితిలో తరలించవద్దని వారు ప్రభుత్వాన్ని కోరారు. మిగతా కార్యాలయాలకు, న్యాయస్థానాలకు స్పష్టమైన తేడా ఉన్నదన్నారు. వీటికి స్థల కేటాయింపు సమయంలో ప్రజా రవాణా, రక్షణ, ఇతర మౌలిక సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. గడచిన పది రోజుల నుండి న్యాయవాదులు రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వం సనుకూలంగా స్పందించకపోవడం విచారకరమన్నారు. న్యాయవాదులు చేస్తున్న డిమాండ్ వారి కోసం కాదని ఇందులో ప్రజా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కేటాయించిన స్థలంతో దూరం పెరగటంతో పాటు ఐదు నెలలపాటు సాగే జమ్ములమ్మ ఉత్సవాలతో కక్షిదారులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది. న్యాయస్థానాలలో సమయపాలనకు ఉన్న ప్రాధాన్యత ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. ఇవేవీ పట్టించుకోకుండా జిల్లా కలెక్టర్ తీవ్ర అసౌకర్య ప్రాంతాన్ని జిల్లా కోర్టు సముదాయాన్ని కేటాయించడం తాముతీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒత్తిడికి తలవగ్గి గద్వాల ప్రజాప్రతినిధులు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటు న్నారన్నారు. పిజెపి కాలనీలో స్థలం కేటాయించే వరకు న్యాయ వాదులు ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున ఆ పార్టీ నేతలు కురువవిజయ్ కుమార్, నాగర్‌దొడ్డి వెంకట రాములు, కురువ పల్లయ్య, అతిఖూర్ రహమాన్, వైద్యుల సంఘం నుంచి డాక్టర్లు మోహన్‌రావు, గోవర్ధన్, సతీష్‌కుమార్, నళిని, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు పూడూరు అచ్చన్న గౌడ్, పాలమూరు అధ్యయన వేదిక గద్వాల శాఖ కన్వీనర్ ఇక్బాల్ పాషా, ఆర్యవైశ్య సంఘం నేతలు ఆలూరురాము, బాలస్వామి, నరహరి శ్రీనువాసులు, రాంమోహన్, తదిత రులు పాల్గొని ప్రసంగించారు. మొదటిరోజు దీక్షలో న్యాయవాదులుశోభారాణి, విజయ్‌కుమార్, మోలా సాబ్, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటయ్యలు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది తిమ్మయ్య గుప్తా వీరికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

# విద్యా రంగం అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలు అభివృద్ధి

◆ టిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్ ◆ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు 9వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

**గద్వాల డిసెంబరు18 ప్రభాతవార్త:** సమ్మెలో వినూత్న కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, మానవహారం, డాక్టర్ బాబు సాహెబ్ అంబేద్కర్‌కి వినతి పత్రం ఇస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల డిమాండ్స్ నెరవేరాలనిఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ రాజీవ్ మార్గ్, స్మృతి వనం, నుండి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ నిరసన తెలిపారు. టిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ విధులను బహిష్కరించి రోడ్ల మీదికి రావడం బాధాకరం అన్నారు. సిద్దిపేటలో మీ సమ్మెకు హరీష్‌రావు సంఘీభావం తెలపడం జరిగిందన్నారు. గతంలో కూడా మేము మద్దతు ఇచ్చాం అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైంది? ఎందుకు సమస్యపై ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మీ సమ స్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం అని, మా పార్టీ మీకు అండగా ఉంటుందని, ప్రతి ఉద్యోగి కూడా మీరు కోరిన డిమాండ్స్ నెరవే రాలని డిమాండ్‌చేశారు. మా ప్రభుత్వం తరఫున కోరుకుంటున్నామ న్నారు. అదే విధంగా మా అధిష్టానం దృష్టికి మీ సమస్యలను కంపల్సరీ తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. రిటైర్డ్ ఎంఈఓ బసవరాజ్ మాట్లాడుతూ ఈ ఉద్యమం విజయవంతం కావాలని ఆశిస్తున్నాను అన్నారు. విద్యాశాఖలో నిర్లక్ష్యం తగదని, విద్యా రంగం అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కావున కంపల్సరీ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సమ్మెకు మద్దతు తెలిపి పాల్గొన్నారు. వెంకటస్వామి మాట్లాడుతూ వెట్టి చాకిరి చేయడం తప్పఏ ప్రయోజనం కలగలేదన్నారు. ఐజ మండల తరఫున మా యొక్క మద్దతు ఉంటుంది అని సమ్మెకు మద్దతు తెలిపారు. శర్మ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల 9వ రోజు మా ఐజ మండల ఎంఈఓ, మా ఉపాధ్యాయులందరూ మద్దతు ఇస్తున్నామని, మీ పోరాటము కొనసాగించాలని, తప్పక విజయం సాధిస్తారు అన్నారు. తప్పక మీ డిమాండ్స్ నెరవేరుతాయి అని సమ్మెకు మద్దతు తెలిపారు. ఐజ ఎం ఈఓ రాము మాట్లాడుతూ ఉద్యమాల గడ్డ మన నడిగడ్డని, ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు బలిదానాలు, అయితే తప్ప మన రాష్ట్రం సిద్ధించలేదన్నారు. వెట్టిచాకిరి చేస్తున్న మీత్యాగాలు వృధా కారాదని, మీ పోరాటం వృధా కారాదని పాలకులు మనల్ని విడగొట్టి పాలించడంలో సిద్ధహస్తులు అన్నారు. రాజకీయ నాయకులు హామీలు నెరవేర్చడం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు విప్లవమైనట్లు ఎక్కడ చరిత్రలో లేదన్నారు. ఉద్యమం బతకాలని, ఉద్యమం ఒకటెంట్‌లోనే కాదు అంతట వ్యాపించి ఉండాలన్నారు సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలపడం జరిగిందన్నారు. అదేవిధంగా అన్ని కేజీబీవీల నుండి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, యూఆర్ఎస్, స్పెషల్ ఆఫీసర్ శేషన్న ,సి. ఆర్. టి. లు. పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. డీపీఓ వింగ్ అధ్యక్షుడు డిఎల్ ఎంటి .బి రామాంజనేయులు, మిస్ వింగ్ అధ్యక్షుడు శ్రీధర్, సీసీఓ వింగు అధ్యక్షుడు ఆల్తాఫ్, సీఆర్పీ వింగ్ అధ్యక్షుడు ఎంప సమీ, ఐఈఆర్ పివింగ్ అధ్యక్షుడు మురళి, పిటిఐ వింగ్ అధ్యక్షుడు రాజేందర్ రోజువారిగ వీరు పాల్గొన్నారు. అదేవిధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఉషన్న ,జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్, మల్దకల్ డీఈఓ విజయ్, సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని బుధవారం నిరవధిక సమ్మెను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులుపాల్గొనడం జరిగింది. మా ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకు లే అవుట్లు

■ జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



ఆత్మకూరులోని వెంచర్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**ఆత్మకూరు డిసెంబరు18 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకే ప్లాట్లు చేసే యజమానులకు లే అవుట్లు అనుమతులు జారీ చేస్తామని జిల్లా అదనప కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని భార్గవి నగర్, శ్రీవాణి పాఠశాల సమీపంలో నూతనంగా లే అవుట్ల కోసం దరఖాస్తు చేసుకున్న యాజమాన్లతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన పక్షంలో లేవట్లు ఇచ్చినప్పటికీ రద్దు చేసేందుకు వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆత్మకూరు పట్టణ సమీపంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి వంటగదును పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ నాణ్యమైన భోజనాలు పెడుతున్నారా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబా పాఠశాలకు సరఫరా చేసే వంట సరుకులను పూర్తిగా పరిశీలించిన తర్వాతనే విద్యార్థుల సమక్షంలోనే సరుకులు తీసుకోవాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో జరుగుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకొని విద్యార్థులకు భోజనాలు వడ్డించే ముందు సంబంధిత అధికారులు రుచి చూసిన తర్వాతనే వడ్డించాలని అదనపు కలెక్టర్ అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంబడి ఆత్మకూర్ తాహశీల్దార్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ చైర్మన్ గాయత్రి రవికుమార్ యాదవ్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



బాలల హక్కులపై మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

**లింగాల, డిసెంబరు 18 ప్రభాతవార్త:** బాలల హక్కుల కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యం తో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో మండల స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల అక్రమ రవాణా, ఒకచోట నుండి మరోప్రాంతానికి కిడ్నాపింగ్ చేయడం, ఐపిసి సెక్షన్ 360,362,365 ప్రకారం అక్రమంగా బాధితులను కొనుగోలు చేయడం, ఐపిసి సెక్షన్ 366 మరోకరిని బాధితులను అమ్మినట్లు చేయడం సెక్షన్ 372ఐపిసి అమే వ్యక్తిత్వానికి లేదా గౌరవానికి భంగం కలిగిస్తే సెక్షన్ 354ఐపిసి, శారీరక మానసిక వేధింపులు, శరీరంపై రకరకాలైన గాయాలతో కూడిన గుర్తులు అణిగిమణిగి ఉన్నట్లుగా ప్రవర్తించడం, సంసిద్ధత తో ఉండడం మీరు అక్రమ రవాణాకి సంబంధించిన సంఘటనను గమనించగానే అది అత్యవసర పరిస్థితి గా భావించి వెంటనే పోలీస్ 100 లేదా 181,1098 హెల్ప్ లైన్‌కి ఫోన్ చేయాలని సూచించారు. బాలలపై లైగింక నేరాల నిరోధక చట్టం చూపించబడిన లైగింక దాడికి పాల్పడితే 7 సం॥లు జైలు శిక్ష లేదా జరిమానా విధించబడుతుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం, బాలుడు 21 ఏండ్లు పూర్తికాని, 18 సం.లు నిండని అడ పిల్లలకు వివాహాలు చేయరాదని సూచించారు. అనంతరం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసినప్పుడే వీటిని నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజనేయులు, ఎంపిఓ చంద్రశేఖర్, ఎంఇఓ బషీర్ అహ్మద్. వార్డెన్ కృష్ణయ్య, ఎంఆర్ఐ సీతారాం నాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ గిరిజా, సఖి లీగల్ అడ్వయిజర్ సరిత, చైల్డ్ ప్రొటెక్షన్ కేర్ మల్లేష్ యాదవ్, కోనేరు సంస్థ కో ఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కో ఆర్డినేటర్ ఎం శ్రీనివాస్ యాదవ్, రజిత, అంగన్వాడి, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీఓస్ హాల్ ప్రారంభోత్సవానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరండి

**టీఎన్జీఓస్ జోగులాంబ జిల్లా అధ్యక్షులు నాగర్జునగౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న టిఎన్జిఓ అధ్యక్షులు నాగార్జున గౌడ్

**గద్వాల డిసెంబరు 18 ప్రభాతవార్త:** 20న టిఎన్జీఓ నూతన సమావేశ మందిరం ప్రారంభం అవుతుందని జిల్లా అధ్యక్షులు నాగార్జున గౌడ్, రాష్ట్ర నాయకులు భీమన్న, బీజాపూర్ ఆనంద్ కోరారు. భుదవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం భవనం నందు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా జోగులాంబ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షులు నాగార్జున గౌడ్ మాట్లాడుతూ టిఎన్జీఓస్ మొదటి అంతస్తు హాలును డిసెంబర్ 20 శుక్రవారం 11 గంటలకు టీఎన్జీఓ కేంద్ర సంఘ అధ్యక్షులు మారంజగదీశ్వర్ ప్రారంభిస్తున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంఎస్ హుస్సేన్ ముజీబ్, ప్రత్యేక ఆహ్వానితులు కేంద్ర సంఘ సహా అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, కేంద్ర కార్యదర్శి భీమన్న, రాష్ట్ర కార్యవర్గం తెలంగాణలోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సోదర సంఘ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ హాలు సంఘ సభ్యుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందనన్నారు. సమస్యలు చర్చించుకుని, సాధన దిశలో పరిష్కరించే మార్గం ఏర్పడుతుందన్నారు. అందుకు టీఎన్జీఓస్ జోగులాంబ జిల్లా శాఖ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. డిసెంబర్ 20 శుక్రవారం 11 గంటలకు హాలు ప్రారంభ కార్యక్రమానికి టీఎన్జీఓస్ ఉద్యోగులు అనుబంధ సంఘ ఉద్యోగులు నాయకులు పెద్ద తరలి రావాలని కోరారు ఈ సమావేశంలో టీఎన్జీఎస్ కేంద్ర కార్యదర్శి భీమన్న టీఎన్జీవోస్ జోగులాంబ జిల్లా కార్యదర్శి బీజాపూర్ ఆనంద్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘంజోగులాంబ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట రాజారెడ్డి, టీఎన్జీఓస్ జోగులాంబ జిల్లా సహాయ అధ్యక్షులు కే నాగేష్, కోశాధికారి విష్ణు, సంస్కృతిక కార్యదర్శి కే మురళీధర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు బద్రున్నిసా బేగం, కార్యవర్గసభ్యులు, టీఎన్జీఓస్‌గద్వాల యూనిట్ కార్యదర్శి అర్పిత ,టీఎన్జీఓ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆల దేవరకద్రకు చేసింది శూన్యం

-పదేళ్లలో జరగని అభివృద్ధి పది నెలల్లో చేసి చూపించాం

-మీడియా సమావేశంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు



**భూత్పూర్, డిసెంబరు18, ప్రభాతవార్త:** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మతి స్థిమితం కోల్పోయి మతి తప్పి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్‌లువిమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర అభివృద్ధి శూన్యమని, దేవరకద్ర నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఒరగబెట్టిందేమిలేదని అన్నారు. గడిచిన పది నెలల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి తమ ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవతో కోట్ల నిధులు మంజూరు చేయించి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పాటు పడుతుంటే ఇది చూసి కూడా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కళ్ళుండి చూడలేని కబోదిలా ప్రవర్తిస్తూ తమ పార్టీపైన, సీఎం రేవంత రెడ్డిపైన, తమ ఎమ్మెల్యేజీఎంఆర్‌పైన బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బుధవారం సాయంత్రం భూత్పూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్‌లు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి తమ స్వప్రయోజనాల కోసం పనిచేశారని, కాంట్రాక్టు కమిషన్లకు కక్కుర్తిపడి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పెండింగ్‌లో ఉంచారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డిశ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తమ ఎమ్మెల్యే జీఎంఆర్ దేవరకద్ర నియోజక వర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. అసెంబ్లీలో నియోజక వర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులపై మాట్లాడారని అన్నారు. దేవరకద్రలో డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్, సీసీకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారన్నారు. కురుమూర్తి దేవస్థానం రోడ్డు కోసం రు. 34కోట్ల నిధులు కేటాయించారని, నియోజక వర్గంలోని రోడ్లకు రు. 110కోట్ల నిధులు కేటా యించి అభివృద్ధికి పాటు పడుతున్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేఆల తన సొంత మండలానికి కూడా ఏమి చేయలేకపోయారని విమర్శించారు. పదేళ్ల కాలంలో భూత్పూర్ మండలంలోని హస్నాపూర్‌కు రోడ్డుసౌకర్యం లేదని, తమ ఎమ్మెల్యేజీఎంఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు హస్నాపూర్ రోడ్డుకు రు. 16లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని మూడేళ్లలో పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికి ఇంతవరకు పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. లగచర్లపై బీఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని, ఇక్కడి ఎమ్మెల్యే ప్రోత్సాహంతో కొంత మంది రైతులు కానివారు అధికారులపై దాడులకు పాల్పడితే వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారని అన్నారు. అరెస్టయిన వారు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పేరును ప్రస్తావించారని పేర్కొన్నారు.

**బహిరంగ చర్చకు సిద్ధం:** గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధేంటో తమ కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల కాలంలో చేసిన అభివృద్ధేంటో చర్చించేందుకు బహిరంగ చర్చకు సిద్ధమని, ఇందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా అని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే ఆల దళితులకు అన్యాయం జరిగిందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించడం కాదు..దమ్ముంటే అభివృద్ధిపై అంబేద్కర్ విగ్రహం ముందు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

**భూత్పూర్‌లో బీఆర్ఎస్ కాదు బీఎస్ఎస్ నడుస్తోంది :**

**- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్**

భూత్పూర్ పట్టణంలో ఇంతవరకు అధికారం చెలాయించింది భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ కాదని, భూత్పూర్ సత్తూర్ సమితి (బీఎస్ఎస్) అని కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఎద్దేవా చేశారు. అధికారం ముగ్గురి(సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్) చేతిలో మాత్రమే ఉందని విమర్శించారు. సత్తూర్ కుటుంబంతో విసిగిన జనం ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డితో పాటు నాయకులు మాధవరెడ్డి, హరియా నాయక్, లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్ , బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, రావులపల్లి నర్సిం హులు, హస్నాపూర్ కొండన్న, తమన్నగౌడ్, పవన్‌కుమార్, వడ్డె శ్రీనివాసులు, ఆగిరి రవి తదితరులు పాల్గొన్నారు.